హైదరాబాద్ వార్త



# అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం

**- నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యంతో ఆరేళ్లు కావస్తున్నా పూర్తికాని ఫ్లైఓవర్**
**-ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు**



**హైదరాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** వాహనదారుల ట్రాఫిక్ కష్టాలను తీర్చాల్సిన అంబర్‌పేట ఫ్లైఓవర్ సమస్యలకు, ప్రమాదాలకు కారణమవుతోంది. వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్ నిర్మాణం ఇంకెన్నాళ్లు అంటూ మండిపడుతున్నారు. ఫ్లైఓవర్ సకాలంలో నిర్మాణం పూర్తి చేసుకోవకపోవడమే. ఆరేళ్లు కావస్తున్న ఇంకా ఫ్లైఓర్ పూర్తికాకపోగా ప్రమాదాలకు, వ్యాపారులకు కన్నీళ్లను పెట్టిస్తోంది. ఇక్కడి వ్యాపారుల పాటిట శాపంగా పరిణమించిందని ఫ్లైఓర్ కింది వ్యాపారులు అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపిస్తున్నారు. చే సాల్ కిందట వరంగల్ జాతీయ చే నంబర్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడానికి పనులు ప్రారంభించారు. అవి నత్తకే నడకలు నేర్పే విధంగా తయారయ్యాయి. నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో అన్ని విధాల పరిశీలించిన అనంతరమే పనులు ప్రారంభించారు. ఇక్కడ ఉన్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టకొని నిర్మాణ సమయాన్ని అంచనా వేశారు. కాని ఆరేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. అన్నిటికి మించి చే నంబర్ చౌరస్తా నుండి వెంకటరమణ థియేటర్ వరకు పనులు ఎంతకూ ముందుకు సాగడం లేదు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఎప్పుడో పూర్తి చేసి వాహనదారలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అధికారులు నిద్రలో జోగుతుండడం వల్లే పనులు అలస్యం అవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఈ మార్గంలో ప్రధానంగా ఉప్పల్, రామంతాపూర్, ముసారంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అంబర్‌పేట, గోల్నాక, కోఠి, నల్లకుంట, ఉస్మానియా యూనివర్సిటీ మార్గాలు అనుసంధానమై ఉన్నాయి. ఫ్లైఓవర్ పనులు ఆలస్యం అవుతుండడంతో ఆయా మార్గాల ద్వారా వచ్చే వాహనదారులు చిన్నచిన్న గల్లీలలో నుండి ప్రయాణించి దాదాపు రెండున్నర కిలోమీటర్‌లు చుట్టు తీరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**వంద మీటర్‌ల దూరానికి ఏడాద్నిరగా..**

అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా శ్రీరమణ సినిమా థియేటర్ వద్ద నుండి ముస్లిం శ్మశానవాటిక మీదుగా షెర్టాన్ హోటల్ వరకు నిర్మాణం కోసం ఏడాదిన్నర కిందట ట్రాఫిక్ అధికారుల అనుమతితో ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఇక్కడి నుండి వాహనాలను అనుమతించకపోవడంతో అప్పటి నుంచి ఇతర చిన్నచిన్న గల్లీల ద్వారా కేవలం వంద మీటర్‌ల దూరంలో ఉన్న గమ్యాన్ని చేరుకోడానికి కూడా దాదాపు రెండున్నర కిలోమీటర్‌ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. శ్రీరమణ థియేటర్ నుంచి షెర్టాన్ హోటల్ వరకు జరపాల్సిన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి కేవలం 9 నెలలు చాలని అప్పట్లో అధికారులు తెలిపి. దాదాపు ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు. వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఇంత జాప్యం జరిగితే అధికారులు అంతర్గత, ఇతర ప్రధాన రోడ్లపై జరపాల్సిన పనులు ఇంకేంత నిర్లక్ష్యంగా, ఇంకెంత నిదానంగా జరుపుతారోనని చెప్పుకుంటున్నారు. చిన్నచిన్న గల్లీలలో నుండి వాహనాలు వెళుతుంటే అక్కడే నివాసం ఉండే వారు వారివారి పిల్లలు రోడ్లపైకి వస్తే పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలు గల్లీలలో ఆడుకోడానికి కూడా అవకాశం లేదని, బస్తీల ప్రజలు రోడ్డుకిరువైపులా కలిసిమెలిసి మాట్లాడుకునే వాళ్లమని, ఇప్పుడు ఆ పరిస్తితి లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అంబర్‌పేట చాకలిబస్తీ, పోచమ్మబస్తీ, బూరుజుగల్లీ, ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఫ్లైఓవర్‌కు ఆనుకొని వ్యాపారాలు జరుపుకునే వారు వ్యాపారాలు సాగక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలు సన్నగిల్లి ఆర్థికంగా నష్టపోతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అంబర్‌పేట చేనంబర్ మార్గాన్ని పూర్తిగా మూసివేయడం వల్ల వాహనదారులు అలీకేఫ్ చౌరస్తా మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. కేవలం కొద్దిపాటి దూరం మాత్రమే పనులు పూర్తి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా, నిదానంగా పనులు జరుపడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడాల్సివస్తోందని అంటున్నారు. తాజాగా ఫ్లైఓర్ కిందిభాగంలో ఎక్కడికక్కడ గుంతలు తొవ్వి వదిలేయడం వల్ల స్థానికంగా ఉండే ద్విచక్రవాహనదారులు ఈమార్గంలో ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వల్పవ్యవధిలోనే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

### నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యం

**-ఎర్రబోలు నర్సింహారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్‌నేత**



ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలి. నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యం తీవ్రంగా కనిపిస్తోంది. సరైన ప్రణాళిక, డిజైన్ లేకపోవడం, పలుమార్లు డిజైన్‌ను మార్చడంతో పనుల్లో తీవ్ర అలస్యం జరుగుతున్నది. స్థానిక ప్రజలకే కాకుండా, వాహనదారులకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఫ్లైఓవర్ సకాలంలో పూర్తికాకపోవడంతో స్థానిక వ్యాపారులు తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడిన పరిస్థితులు ఉన్నాయి. నవంబరు నెలలో పూర్తిచేస్తామని ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించినా ఆయన మాటలను అధికారులు పాటించేలా కనిపించడంలేదు.

# దీపావళి సందర్భంగా పూల ధరలకు రెక్కలు

**-కిలో కనకంబరాలు 1200 రూపాయలు**
**-పూల ధరలు విపరీతంగా పెరగటంతో కొనలేని పరిస్థితిలో ప్రజలు**
**-మార్కెట్ రహదారులు ట్రాఫిక్ మయం**





వాహనాల రద్దీ

**మెహిదీపట్నం, అక్టోబరు 30 ప్రభాతవార్త :** పూల ధరలకు రెక్క లొచ్చాయి. ఏ పూలను కొందామన్న కొండెక్కి కూర్చోవటంతో ప్రజలు సగం మేర పూలను కొనుగులు చేసి సరిపెట్టుకున్నారు. దీపావళీ పండుగ సందర్భంగా గుడి మల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌కు పెద్ద మొత్తంలో పూలు రావటంతో మార్కెట్ పూలతో నిండి పోయింది. పూల వ్యాపారులు పూల ధరలను విపరీతంగా పెంచటంతో కొనుగోలుదారులు మూడు, నాలుగు కేజీల పువ్వులను కొందామనుకున్న కొనుగోలుదారులు కేవలం కేజీ, కేజీన్నర పూలను మాత్రమే ఖరీదు చేశారు. దీపావళీ పండుగ సందర్భంగా పూల ధరలు మూడింతలు పెరిగాయి. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌కు వివిధ రకాల పూలూ వచ్చాయి. బంతి, టైగర్ రూబీ పూలు చేవెళ్ల మొయినాబాద్, శంషాబాద్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి రాగా, చామంతి, గులాబీ, కనకంబరాలు, మల్లెలు అనంతపూర్, చేవెళ్ల, మొయినాబాద్. వికారాబాద్, శంషాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాలు నుంచి వచ్చాయని, బుధవారం మార్కెట్‌కు 30 క్వింటాల పూలు రావటం జరిగిందని మార్కెట్ అధికారులు వెల్లడించారు. కొనుగోలుదారులతో పూల మార్కెట్‌లో అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌కు వచ్చే వాహనాలు రహదారిపై నిలిచి పోయాయి. రహదారులన్నీ రద్దీగా మారాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

| పూల పేర్లు | ధరలు |
|---|---|
| బంతి | 40 రూ.నుంచి 100 రూపాయలు |
| చామంతి | 80 రూ నుంచి 160 రూపాయలు |
| గులాబి | 150 రూ.నుంచి 250 రూపాయలు |
| టైగర్ రూబీ | 250 రూ నుంచా 350 రూపాయలు |
| మల్లె మొగ్గలు | 520 రూ.నుంచి 600 రూపాయలు |
| కనకంబరాలు | 1000 రూ. నుంచి 1200 రూపాయలు |
| లిల్లీ పూలు | 50 రూ. నుంచి 150 రూపాయలు |

# టపాసుల మోత ..శ్రుతి మించొద్దు

**జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమోద దీపావళి | పర్యావరణ హితంతోనే ఆనందం, ఆరోగ్యం | 45 డెసిబుల్స్ దాటితే హానికరం**



**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త**

దివ్వెల పండుగ దీపావళిని శబ్ద వాయు కాలుష్య రహితంగా జరుపుకొంటేనే ఆనందకరం. ఆరోగ్య ప్రదమని సూచిస్తున్నారు పలువురు పర్యావరణ వేత్తలు. ఆకాశంలో మిరుమిట్లు గొలిపేలా వెలుగులు విరజిమ్మే బాణసంచా..టపాసుల మోతలతో మహానగరం దద్దరిల్లడం ప్రతియేటా పరిపాటే.. కానీ టపాసుల మోత అవధులు మించితే చిన్నారులు, వృద్దులు, రోగులు, పెంపుడు జంతువుల మనుగడే ప్రశ్నార్థకం కానుంది. వాయు కాలుష్యంలో సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ మోతాదు కూడా భారీగా పెరిగి శ్వాసకోశ, కళ్ల సంబంధిత వ్యాధులు పెరిగే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా టపాసులు కాల్చినప్పుడు వెలువడే శబ్దాలు నివాస ప్రాంతాల్లో 45 డెసిబుల్స్ (ధ్వనిని కొలిచే ప్రమాణం) మించరాదు. కానీ నగరంలో ధాం..ధాం శబ్దాలు ఏటా 90 డెసిబుల్స్‌కు మించి నమోదవుతుండడం పట్ల పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అతిధ్వనులు చిన్నారులు, వృద్దులు, రోగులు, పెంపుడు జంతువుల్లో విపరిణామాలు సృష్టించడం తథ్యమంటున్నారు.

**వాయు కాలుష్యంతో ముప్పే..**

-టపాసులు కాల్చినప్పుడు వెలువడే పొగలో సల్ఫర్‌డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, ధూళి రేణువులు పర్యావరణంతో పాటు సిటీజన్ల ఊపిరితిత్తులకు తీవ్ర హాని కలిగిస్తాయి.

-సల్ఫర్ డై ఆక్సైడ్ క్యూబిక్ మీటరు గాలిలో 80 మైక్రోగ్రాములు మించరాదు. టఫాసులు అత్యధికంగా కాల్చినప్పుడు క్యూబిక్ మీటరు గాలిలో సల్ఫర్ డై ఆక్సైడ్ 450-500 మైక్రోగ్రాములకు చేరుకుంటుంది. దీంతో ఊపిరితిత్తులకు హాని కలుగుతుంది. బ్రాంకైటిస్ తీవ్రమైన దగ్గు తప్పదు.

-నైట్రోజన్ ఆక్సైడ్ పరిమితి క్యూబిక్ మీటరు గాలికి 80 మైక్రోగ్రాములు మించరాదు. టపాసులు అత్యధికంగా కాల్చినప్పుడు దీని మోతాదు క్యూబిక్ మీటరు గాలిలో 450-500 మైక్రో గ్రాముల వరకు పెరుగుతుంది. దీంతో కళ్ల ముక్కు మండుతాయి. శ్వాసకోశాలకు తీవ్ర చికాకు కలుగుతుంది.

-ధూళి రేణువులు క్యూబిక్ మీటరు గాలిలో 100 మైక్రోగ్రాములు మించరాదు. వీటి మోతాదు కూడా క్యూబిక్ మీటరు గాలిలో 300 మైక్రోగ్రాములు మించే పరిస్థితి తలెత్తడంతో తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు తథ్యం.

-90 డెసిబుళ్లకు మించిన శబ్దాలు విన్నప్పుడు కొందరికి తాత్కాలిక చెవుడు, మరికొందరికి దీర్ఘకాలిక చెవుడు వచ్చే ప్రమాదం ఉంది.

-చిన్నపిల్లల కర్ణభేరిలోని సూక్ష్మనాడులు దెబ్బతింటాయి. వృద్దులకూ శాశ్వత చెవుడు వచ్చే ప్రమాద ఉంది. ఒకేచోట అత్యధిక ధ్వనిని ఇచ్చే టపాసులు కాల్చితే ప్రమాదం తప్పదు.

**విపరిణామాలు ఇలా..**

గ్రేటర్‌లో నిత్యం సుమారు 800-1000 మంది చిన్నారులు జన్మిస్తున్నారు. నవజాత శిశువులు 90 డెసిబుల్స్ దాటిన శబ్దాలు వింటే వారిలో వినికిడి శక్తి కోల్పోతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వారి గుండె కొట్టుకునే వేగం పెరిగి ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తడం తథ్యమంటున్నారు.

-కుక్క, పిల్లి లాంటి జంతువులు 50 డెసిబుల్స్ దాటిన శబ్దాలను వింటే విపరీతంగా ప్రవర్తిస్తాయని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. కొన్నిసార్లు వాటి కర్ణభేరి బద్దలయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. అతిధ్వనులు విన్న జంతువులు ఇంటి నుంచి పరుగెత్తి రోడ్లు ప్రమాదాల బారిన పడడం, కరవడం వంటిప్రవర్తన చూపుతాయని చెబుతున్నారు.

-రాకెట్లు, భూచక్రాల వంటివి కాల్చినప్పుడు పెంపుడు జంతువులకు తగిలి గాయలపాలవుతాయి. దీంతో అవి వణుకుడు బారినపడతాయి. ఈ గాయాలు సమీప భవిష్యత్తులో వాటికి పెనుముప్పుగా మారడం తథ్యం.

**పరిష్కారం ఇలా...**

-తక్కువ శబ్దం వెదజల్లే చిచ్చుబుడ్లు, భూచక్రాలు, పెన్సిల్స్ వంటివి కాల్చాలి. అత్యధిక శబ్దాలు వినిపించే ప్రాంతాల్లో ఈయర్ ప్లగ్‌లు వాడాలి. శబ్దాలు కాకుండా వెలుగులు విరజిమ్మే మతాబులను ఎంపికచేసుకోవాలి.

-విపరీత శబ్దాలు కర్ణభేరికి సోకకుండా చెవుల్లో దూది పెట్టుకోవాలి.

-టపాసుల మోత శ్రుతి మించకుండా చూసేందుకు కాలనీ సంక్షేమ సంఘాలు ప్రయత్నించాలి.

**జాగ్రత్తలతో ఆనందకేళి..**

– సరోజినీదేవి ఆసుపత్రిలో అత్యవసర విభాగం.. దీపావళి అంటే పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఎంతో ఆనందకరంగా జరుపుకొనే పండుగ. ప్రతి ఒక్కరూ టపాసులు కాల్చుతూ.. మిఠాయిలు పంచుకుంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఆనందగా గడుపుతుంటారు. దీపావళి అందరి ఇళ్లల్లో ఆనందకేళి కావాలంటే జాగ్రత్తలు అవసరమని నేత్ర వైద్యులు చెబుతున్నారు. ఏటా టపాసుల కారణంగా సరోజినీ దేవి నేత్ర ఆసుపత్రితో పాటు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో అత్యవసర విభాగాలకు 100కు పైగా బాధితులు వస్తుంటారు. ఇందులో పిల్లలు ఎక్కువే. ఈ నేపథ్యంలో పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రంగయ్య పలు సూచనలు చేశారు.

**ఇలా చేయండి..**

– గాయపడిన వ్యక్తిని వీలైనంత త్వరగా నేత్ర సంరక్షణ నిపుణుల వద్దకు తరలించాలి.

– కంటిలో నలకలుంటే శుభ్రమైన నీరు లేదా సెలైన్ ద్రావంతో మృదువుగా శుభ్రం చేయాలి. సబ్బులాంటివి వాడకూడదు.

– కంటికి గాయమైతే అక్కడ శుభ్రమైన పొడి వస్త్రంతో కప్పాలి లేదంటే కన్ను మూసి ఉంచాలి.

**ఇవి తప్పనిసరిగా పాటించండి..**

– అదీకృత తయారీ సంస్థలకు చెందిన టపాసులు మాత్రమే కొనుగోలు చేయాలి. రెండు రోజుల ముందు కొని వాటిని ఎండబెట్టాలి.

–వాటిని పిల్లలకు అందకుండా ఆట్ట డబ్బాల్లో పెట్టి దూరంగా పెట్టాలి. గ్యాస్ సిలిండర్, నూనె లాంటి మండే పదార్థాలకు దూరంగా ఉంచాలి.

– పెద్దల పర్యవేక్షణలో మాత్రమే పిల్లలు టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

– టపాసులను వెలిగించడానికి పొడవైన కొవ్వొత్తి లేద కాకరపువ్వొత్తి ఉపయోగించాలి.

– మంటలు చెలరేగితే ఆర్పడానికి రెండు బక్కెట్‌ల నీళ్లు దగ్గర పెట్టుకోవాలి. ఒంటికి గాయాలైతే పరిశుభ్రమైన దుప్పటితో చుట్టి వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

– టపాసులు కాల్చేటప్పుడు కంటికి గాయాలు కాకుండా కళ్ల అద్దాలు ధరించాలి.

– చేతితో పట్టుకొని టపాసులు వెలిగంచకూడదు. వెలిగించేటప్పుడు వాటిపై వంగకూడదు. డబ్బాలు, సీసాలు కింద టపాసులు పెట్టి పేల్చకూడదు.

– టపాసులు వెలిగించే సమయంలో మందంగా ఉండే నూలు దుస్తులు ధరించాలి. అవి కూడా బిగుతుగా ఉండాలి. వదులుగా ఉంటే సులువుగా మంటలు అంటుకుంటాయి.

– భారీగా గాలి ఉంటే బాణాసంచా కాల్చకూడదు.

**అత్యవసర సేవలకు ఎల్వీవీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ** 040-88102100, 68102848, 7331129653 సరోజినీ దేవి ప్రభుత్వ నేత్ర వైద్యశాల.. 040-23317274

# ఒ.యూ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొ.నరేష్ రెడ్డి



వీసీ ప్రొ.కుమార్ మొలగారం నుంచి నియామకపు పత్రాన్ని అందుకుంటున్న నరేష్ రెడ్డి

**తార్నాక, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా సీనియర్ ప్రొ.జీ.నరేష్ రెడ్డి బుధవారం పదవీ భాధ్యతలను స్వీకరించారు. ఉపకులపతిగా ఇటీవలే పగ్గాలు చేపట్టిన ప్రొ.ఎం.కుమార్ ఈ మేరకు పరిపాలనా విభాగంలో పలు కీలక పదవులను భర్తీ చేస్తున్నారు. ఈ మేరకు మాజీ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మినారాయణ నుంచి ప్రొ.నరేష్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఇదే సమయంలో జువాలజీ విభాగం సీనియర్ ప్రొ.ఎస్.జితేందర్ కుమార్ ప్రొ.బి.రెడ్యానాయక్ నుంచి ఒ.యూ ఓఎస్డీగా భాధ్యతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా వీసి ప్రొ.కుమార్ మొలగారం రిజిస్ట్రార్, ఓఎస్డీ పదవుల్లో ప్రొ.పి. లక్ష్మినారాయణ, ప్రొ.రెడ్యానాయక్‌లు అందించిన సేవలను గుర్తించి అభినందించారు. ప్రొ.నరేష్ రెడ్డి ఇప్పటి వరకు టీజీసెట్ కార్యదర్శిగా, ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ప్రొ.జితేందర్ ఒ.యూ సైన్స్ కాలేజ్ జువాలజీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన గతంలో ఓ.యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ పనిచేశారు. జువాలజీ విభాగం అధిపతి సహా పలు కీలకమైన పదవుల్లో వర్సిటీకి సేవందించారు.



ఎన్‌టిఆర్ గ్రౌండ్‌లో దిపావళి సందర్భంగా టాపకాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

# తీసుకున్న డబ్బులు ఇవ్వనందుకు టపాసుల షాపుకు నిప్పు పెట్టిన వ్యక్తి

**తార్నాక, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** తీసుకున్న డబ్బులను ఇవ్వనందుకు ఆగ్రహించిన ఓ వ్యక్తి క్రాకర్స్ షాపుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన సంఘట లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ రెడ్డి కథనం ప్రకారం. లాలాపేట్ అయ్యప్ప గుడి ప్రాంతానికి చెందిన సతీష్ రెడ్డి (49) పాల వ్యాపారి అయితే ఇదే ప్రాంతానికి చెందిన గవ్వల నిఖిల్ రాజ్ యాదవ్ అనే వ్యక్తి తన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లించేందుకు రూ.93వేలను సతీష్ రెడ్డి దగ్గర అప్పుగా తీసుకున్నాడు. తిరిగి క్రెడిట్ కార్డు డబ్బులు ఇవ్వాలని పలు మార్లు అడిగినా అతను ఇవ్వడంలేదు. దీంతో తీవ్రంగా కలత చెందిన సతీష్ రెడ్డి మరో సారి మంగళవారం రాత్రి మరో సారి అడిగాడు. దీంతో నిఖిల్ రాజ్ తాను డబ్బులు ఇవ్వనని కరాకండిగా చెప్పాడు. మరో వైపు దీపావళి పండుగ సందర్భంగా నిఖిల్ రాజ్ లాలాపేట్ ప్రధాన రోడ్డులో పటాకుల షాపు పెట్టాడు. ఇదే అదునుగా భావించిన అతను షాపు వద్దకు వెళ్లి షాపును దగ్దం చేయాలనుకున్నాడు. రాత్రి 2.45 ప్రాంతంలో షాపు వద్దకు వెళ్లి షాపుపై పెట్రోల్ చల్లాడు. నిఖిల్ రాజు ఆసమయంలో మేల్కొని ఉండగా పెట్రోల్ వాసన వచ్చింది. దీంతో నిఖిల్ రాజ్, తన స్నేహితుడు శ్రీకాంత్‌లు బయటకు వచ్చిచూడగా సతీష్ రెడ్డి పెట్రోల్ పోస్తూ నిప్పుపెట్టి పారిపోతున్నాడు. దీంతో వారు సతీష్ రెడ్డిని పట్టుకొకున్నారు. అప్పటికే షాపులో టపాసులు ఉండటంతో షాపుకు మంటలంటుకున్నాయి. దీంతో నిర్వాహకులు మంటలను నీల్లు చల్లి ఆర్పేందుకు ప్రయత్నించినా టపాసులు పూర్తిగా కలిబూడిదయ్యాయి. ఈ క్రమంలో నిఖిల్ యాదవ్ కాలుకు గాయమైంది. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సతీష్ రెడ్డిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

# అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**-పండుగపూట కుటుంబంలో విషాదం**

**అత్తాపూర్ అక్టోబరు30, ప్రభాతవార్త :**

అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడంతో పండుగ పూట ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. ఈ ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిదిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం....అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పాండురంగ నగర్‌లో మంగ్యా నాయక్ కుటుంబతో కలిసి ఉంటున్నాడని కుటుంబ పోషణ కోసం అప్పులు చేసిన మంగ్యా నాయక్ తీసుకున్న డబ్బులు చెల్లించలేకపోతుండడంతో మనస్థాపనికి గురైన అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సదర్ జోష్‌కు సర్వం సిద్ధం

**-హర్యానా, గుజరాత్‌ల నుండి నగరానికి చేరిన భారీ దున్నలు**



సదర్‌లో సందడి చేయబోయే దున్నపోతులు

**ముషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** దీపావళి అనగానే గుర్తు వచ్చేది సదర్ ఉత్సవం. ప్రతి సంవత్సరం నగరంలో సదర్ ఉత్సవాలను యాదవ సోదరులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ ఉండటం గత కొన్ని సంవత్స రాలుగా ఆనవాయితీగా వస్తోంది. అదే క్రమంలో ఈ సంవత్సం కూడా నవంబర్ 2న సదర్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతు న్నాయి. అందులో భాగంగానే హర్యాణా, పంజాబ్ వంటి ఇతర రాష్ట్రాల నుండి భారీ దున్నపోతులు నగరానికి చేరుకున్నాయి. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దున్నలు: జాతీయ స్థాయిలో పశువుల ప్రదర్శనలో విజేతగా నిలిచిన దున్నలు ఈసారి సదర్‌లో సందడి చేయనున్నాయి. దాదాపు 1800 కిలోల బరువు, ఆరు అడుగుల ఎత్తు కలిగిన గోల్-2, విధాయక్, శ్రీకృష్ణ, షేరా, బాద్‌షా పేర్లతో పిలువబడే భారీ దున్నపోతులను అఖిల భారత యాదవ మహాసభ (ఏబీవైఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరి బాబుయాదవ్ ప్రత్యేక వాహనాలలో నగరానికి తీసుకువచ్చారు. ప్రత్యేక పోషణ: సదర్ ఉత్సవాలలో పాల్గొనే భారీ దున్నపోతుల పోషణ కూడా చాలా భారీగానే ఉంటుంది. నిత్యం రెండు పూటలా స్నానం చేయించేందుకు ప్రత్యేక డిటర్జెంట్స్, ఆహారంగా పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో పాటు రోజుకు 20 లీటర్ల పాలు తాగిస్తారు. అంతే కాకుండా వీటికి సపర్యలు చేసేందుకు ప్రత్యేక పనివారు. ప్రత్యేక పోషణతో సదర్‌లో సందడి చేసేందుకు సిద్ధంగా ఉన్న దున్న పోతులను చూసేందుకు నగర నలుమూలల నుండి జనాలు తరలి వస్తున్నారు.



## విద్యార్థికి బంగారు పతకం



గోల్డ్ మెడల్ సాధించిన అర్షద్‌ను అభినందిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

**ముషీరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 టైక్ వాండో విభాగంలో కవాడిగూడ ఇంగ్లీష్ యూనియన్ పాఠశాల విద్యార్థి మహ్మద్ హర్షద్ బంగారు పథకం సాధించాడు. బుధవారం కవాడిగూడలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి చదివే మహ్మద్ హర్షద్ గతంలో 2023-24 సంవత్సరంలో మలేషియాలో నిర్వహించిన ఇంటర్నేషనల్ టైక్‌వాండో ఛాంపియన్ షిప్ పోటీలో సైతం ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడని గుర్తు చేశారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో కూడా పోటీలలో పాల్గొని విజేతలు నిలవటం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్స్‌పాల్ స్వర్ణలత మరియు పాఠశాల సిబ్బందితో కలసి ఆయన మహ్మద్ హర్షద్‌ను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియచేశారు.

## పెండిగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలి

**-అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



జీహెచ్ఎంసీ అధికారులతో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** అంబర్‌పేట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా బాధ్యతలు చేపట్టిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు అభినందనలు తెలియచేశారు. అనంతరం అధికారులతో నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. నూతనంగా చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలు వెంటనే తయారు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్‌బాబు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రశాంతి, సంజయ్, ఇతర సిబ్బంది పృధ్వీ, పవన్, శ్రీకాంత్, నరేందర్, మనోహర్, రవి, రాము, దుర్గా పాల్గొన్నారు.

## రోగుల సహాయకులకు అన్నదానం



క్యాన్సర్ ఆసుపత్రి వద్ద రోగుల సహాయకులకు అన్నదానం చేస్తున్న టిఎన్‌జిఒ కేంద్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 30ప్రభాతవార్త:** అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు,టిఎన్‌జిఒ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఆసుపత్రి వద్ద రోగుల సహాయకులకు కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్‌తో కలిసి అన్నదానం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలోఫర్,క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రోగుల వెంట వచ్చే రోగిసహాయకులకు ప్రతినెల నాలుగు వారాలు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. వారికి అన్న దానం ద్వారా చేసే అదృష్టం దేవుడు ఇచ్చినట్లు తెలిపారు.బతికినంత కాలం అన్నదానం సేవ చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో కేంద్రం సంఘం అసోసియేట్అధ్యక్షులు కస్తూరి వెంకట్, హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్ రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, బి.శివకుమార్, మహ్మద్ వహిద్ తదితరులు పాల్గొన్నారు.

## లైన్‌మెన్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి



లైన్‌మెన్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని బేగంబజార్ డిఇ మహ్మద్‌పర్వాత్‌అలీకి తెలుపుతున్న ఉద్యోగులు

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 30ప్రభాతవార్త:** కార్వాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ బిల్లు చెల్లించనందుకుగాను విద్యుత్ కనెక్షన్ తొలగించిన లైన్‌మెన్‌పై దాడి చేసి వ్యక్తి అరెస్ట్ చేయాలని కోరుతూ బేగంబజార్ ట్రాన్స్‌కో ఉద్యోగులు కలిసి డిఇ మహ్మద్ పర్వాత్‌అలీకి విన్నవించారు.కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జియాగూడ భీమ్‌నగర్ చౌరస్తా రాహుల్ శర్మ అనే యువకుడు మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు.నాలుగు నెలలుగా షాపుకు సంబంధించిన బిల్లులను సకాలంలో చెల్లించలేదు.దీంతో బిల్లు బకాయిలు సుమారు 4400 వరకు పెండింగ్‌లోఉన్నాయి.దీంతో కరెంట్ కనెక్షన్ తీసి వేయడంతో అనంతరం బిల్లులను చెల్లించాడు.లైన్‌మెన్ శ్రీనివాస్‌రావు,మరో లైన్‌మెన్ ప్రవీణ్,ఆర్టిజన్ సైదులు కలిసి అక్కడికి వెళ్లి విద్యుత్‌ను కనెక్షన్ ఇచ్చారు.అయితే లైన్‌మేన్‌పైరాహుల్‌శర్మ శ్రీనివాస్‌రావు దాడికి దిగాడు.దీంతో విధి నిర్వహణలో ఉన్న లైన్‌మెన్‌పై దాడికి దిగిన రాహుల్‌శర్మను అరెస్ట్ చేసే విధంగా పోలీసు ఉన్నతాధికారులు సిఫారస్సు చేయాలని ఉద్యోగులు బేగంబజార్ డిఇమహ్మద్ రహ్మెత్‌అలీని కలిసి విన్నవించారు.అందుకుగాను ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులకు చెప్పారు.విధి నిర్వహణలో ఉన్న లైన్‌మెన్‌పై దాడి చేసిన రాహుల్‌శర్మను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో నిరసన చేస్తామన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి

**సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని మార్చురికి తరలించారు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న 65సంవత్సరాల వృద్ధుడిని సెక్యూరిటీ సిబ్బంది ఈనెల 22న అస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు తెల్లరంగు గీతల షర్ట్, బ్రౌన్ కలర్ గీతల లుంగీ ధరించాడు. సంబంధికులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## మహిళను దూషించిన పూజారిని విధుల్లో నుంచి తొలగించాలి

**-మాలమహానాడు యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ దయానందన, మాలమహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్**



ప్రసంగిస్తున్న మాలమహానాడు యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ దయానంద, చిత్రంలో మాలమహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్

**చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త:** ఎస్సీ మహిళను కులం పేరుతో అవమానించిన పూజారిని విధుల్లో నుంచి తొలగించాలని మాలమహానాడు యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ దయానందన, మాల మహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. రామ్‌నగర్ స్థానికురాలైన దళిత హక్కుల రక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు మంగ అనే ఎస్సీ మహిళ సొంత ఇల్లు స్థానిక సాయి బాబా ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల పక్కనే ఉందని, గుడిలో పూజారీ చిట్టీల వ్యాపారంపై ప్రశ్నించినందుకు ఆ మహిళను అవమాన పరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. గతంలో ఇదే విషయంపై ఎస్సీ కమిషన్ సభ్యుడికి ఆగస్టు నెలలో ఫిర్యాదు చేయడం జరిగిందని, వెంటనే స్పందించిన కమిషనర్ దేవాదాయ, పోలీసు శాఖలకు నోటీసులు జారీ చేసిందని, కాని ఈ రెండు శాఖల అధికారులు స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ స్పందించి ఆ పూజారిని విధుల నుంచి తొలగించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాలమహానాడు సాధనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రమేశ్, సంయుక్త కార్యదర్శి ఎన్ఎం. వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

## అభ్యుదయ సాహిత్య వైతాళికుడు కొడవటిగంటి కుటుంబరావు



ప్రసంగిస్తున్న హాస్యావధాని, సీనియర్ పాత్రికేయులు శంకరనారాయణ

**చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త:** కొడవటిగంటి కుటుంబరావు ముందు అభ్యుదయ సాహిత్య ఆలోచనతో రచనలు చేసిన వారు ఉన్నా స్పష్టమైన ప్రగతిశీల దృక్పథంలో సాహిత్య సృష్టి చేసిన కొడవటిగంటి కుటుంబరావు అభ్యుదయ సాహిత్య వైతాళికుడుగా పేర్కొడంలో తప్పులేదని హాస్యావధాని, సీనియర్ పాత్రికేయులు శంకరనారాయణ అన్నారు. బుధవారం ఎందరోమహానుభావులుమధుర స్మృతులు కార్యక్రమంలో భాగంగా త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన కొడవగంటి కుటుంబరావు సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హాస్యావధాని శంకరనారాయణ మాట్లాడుతూ కొడవటిగంటి రచనలు హేతుబద్ధంగా ఉంటాయని, ఆయన సామాజిక అంశాలు తర్కబద్దంగా ఆలోచించి పాఠకుడిలో ఆలోచనలు రేకెత్తిస్తారని, ఇందుకు ఉదాహరణ ఆయన రాసిన 'చదువు' నవల అని వివరంచారు. సినిమా రచయిత కూడా ఆయన విజయసంస్థకు పనిచేశారని, చందమామ కథల పత్రికను రూపు దిద్ది ఆసక్తిని ప్రజల్లో కలిగించడంలో ఆయన కృషి ఉందన్నారు. కార్యక్రమంలో కథక్‌కళాక్షేత్ర అధినేత పండిట్ అంజుబాబు, అభనందన సంస్థ స్థాపకురాలు డాక్టర్ ఇ.భవాని తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకమాస మహోత్సవానికి ముస్తాబైన సంగమేశ్వరస్వామి దేవాలయం

**నాంపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త :** ప్రతీ సంవత్సరం కన్నులపండువగా జరుపుకునే కార్తీకమాస మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ముస్తాబైంది. నవంబరు 2 శనివారం నుండి డిసెంబరు 1 ఆదివారం వరకు నెలరోజులపాటు కార్తీకమాస మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.లక్ష్మారెడ్డి మీడియాకు తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను వివరిస్తూ నవంబరు 2 శనివారం రాత్రి 6.30లకు ఆకాశ దీపారాధన ప్రారంభం; నవంబరు 4 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, ఉదయం 7.30, 9.00, 10. 30, 12.00, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాబిషేకములు; 5 మంగళవారం నాగుల చవితి; 9 శనివారం ఉదయం 9లకు విభూత్యాభిషేకం; 11 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, ఉదయం 7, 9, 10.30, 12, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 12 మంగళవారం ఉదయం 9.30లకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు; 13 చిలుకు ద్వాదశి బుధవారం ఉదయం 9లకు శతచ్ఛిద్ర రుద్రాభిషేకము, రాత్రి 6.30లకు తులసి కళ్యాణం; 15 కార్తీక పౌర్ణమి శుక్రవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకము, ఉదయం 7, 9, 10.30, 12లకు ఏకవార రుద్రభిషేకములు, రాత్రి 7లకు జ్వాలా తోరణం (సంకల్పం) పుష్పాలంకరణ; 18 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, ఉదయం 7, 9, 10.30, 12, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు, 19 ఆరుద్ర నక్షత్రం మంగళవారం ఉదయం 9లకు రుద్ర హోమము; 24 ఆదివారం ఉదయం 9లకు అన్నాభిషేకం, 12లకు వనభోజనములు; 25 సోమవారం ఉదయం 7, 9, 10.30, 12, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 29 మాసశివరాత్రి శుక్రవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకము, ఉదయం 7, 9, 10.30లకు ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి 7లకు శివకళ్యాణ మహోత్సవం; 30శనివారం సాయంత్రం 5లకు లక్ష బిల్వార్చన; డిసెంబరు 1 ఆదివారం ఉదయం 9లకు సప్తవింశతి కలశాభిషేకము

తదితర ప్రత్యేక పూజాకా ర్యక్రమాలు ఉంటాయని, అధికసంఖ్యలో భక్తులు విచ్చే సి ఆ పరమశివుని కృపకు పాత్రులవ్వాలని కార్య నిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి కోరారు.

## వీది దీపాలు సమస్యలు పరిష్కరించండి

**-కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి**



అధికారులుతో కార్పొరేటర్

**అల్వాల్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** వీది దీపాలకు సంబంధించిన టైమర్లు సమస్యలను తక్షణం పరిష్కరించాలని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అధికారులను కోరారు.అల్వాల్‌లోని తన నివాసంలో విద్యుత్ అధికారులుతో కార్పొరేటర్ సమావేశం అయ్యారు. వీది దీపాలు పగలు కూడా వెలుగులు జిమ్ముతున్నాయని వాటి టైమర్లు పనితీరు సక్రమంగా లేదని శాంతి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలులో విద్యుత్ స్తంభాలుతో పాటుగా వీది దీపాలు ఏర్పాటు కోసం గతంలోనే వినతులు ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆమె అధికారులను కోరారు.కార్యక్రమంలో ఎక్టికల్ డిఇ రఘుపతి రెడ్డి, శ్రీకాంత్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంకు నేడు,రేపు సెలవు

**చార్మినార్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** దీపావళీ సందర్భంగా ఈ నెల 31వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియంకు సెలవు ప్రకటించారు.గురువారం సాలార్‌జంగ్ మ్యూజియంను మూసివేయనున్నామని మ్యూజియం కీపర్ డాక్టర్.కుసుం తెలిపారు.కాగా శుక్రవారం సాలార్ జంగ్ మ్యూజియంకు రెగ్యులర్ సెలవు కావటంతో గురు,శుక్రవారాలు సాలర్‌జంగ్ మ్యూజియంకు సెలవు దినాలని ఆయన తెలియజేశారు.శనివారం సాలార్‌జంగ్ మ్యూజియం ఎప్పటి మాదిరిగానే పని చేస్తుందని ఆయన తెలిపారు.

## గంగుల కమలాకర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. ఇటీవల గంగుల కమలాకర్ మాతృమూర్తి మృతి చెందారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో ముఠాగోపాల్ తోపాటు బిఆర్ఎస్ సీనియర్ నేత ముఠానరేశ్, డీటీ.రామ్‌చందర్, కనకరాజ్, పారిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తదితరులు

**అడ్డగుట్ట, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే టి.పద్మారావు గౌడ్ తెలిపారు. సితాఫల్ మండి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లోని జోషి కం పౌండ్, టీ.ఆర్.టీ. కాలనీ పార్కు ప్రాంతాల్లో రూ.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న అభివృద్ధి పనులను డివిజన్ కార్పోరేటర్ సామల హేమతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కరాటేరాజు, రాజ సుందర్,సుభాష్, శేఖర్,రాజేశ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సు ఢీకొని రాంకీ మేనేజర్ మృతి

**కుత్బుల్లాపూర్, అక్టోబరు 30 ప్రభాతవార్త**

ప్రైవేట్ బస్సుల మితిమీరిన వేగానికి అడ్డూ అదుపూలేకుండా పోతుంది. ఒకవైపు పాతబస్సులకే ఫిట్‌నెస్ చేయించి తిరిగి నడుపుతుండగా మరోవైపు అతివేగంగా ప్రయాణీకుల ప్రాణాలను బలిగొంటున్న ప్రైవేట్ బస్సు నిర్వాహకుల తీరుతో కార్మికులు, సామాన్యుల ప్రాణాలు హరీమంటున్నాయి. గతకొంతకాలంగా జీడిమెట్ల పారిశ్రామికవాడలో ప్రైవేట్‌బస్సుల ఆగడాలకు ప్రయాణీకులు రోడ్డుప్రమాదాల బారినపడుతూ తీవ్ర ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతుండగా ఏకంగా బస్సుల అతివేగానికి నింపుప్రాణాలు బలైపోతున్నా పోలీసులకు పట్టనివైనం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. షాపూర్‌నగర్ పోలీసు అవుట్‌పోస్టు సమీపంలో ఒక ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన వాహానం అగ్నిప్రమాదానికి గురై స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే సదరు ట్రావెల్స్‌కు సంబందించిన మరో వాహానం బుధవారం రామ్‌కీకంపెనీకి చెందిన మేనేజర్, రిటైర్డ్ మిలట్రీ ఉద్యోగి నింపు ప్రాణాలు కోల్పోయేలా చేసినా అటు అధికారులుగానీ, ట్రావెల్స్ నిర్వాహకులు గానీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ప్రధానంగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న ప్రమాదాలపట్ల అధికార యంత్రాంగ నిర్లక్ష్యవైఖరి పలు అనుమానాలకు తావిస్తుంది. సూరారం కాలనీకి చెందిన ట్రాన్స్‌పోర్టు ఏజెన్సి నిర్వహించే బస్సుల నాణ్యత, నిర్వాహణ పనితీరుపై సర్వత్ర విమర్శలు వస్తున్నా సంఘటన జరిగినప్పుడు చేసే హాడావిడీయేతప్ప తదనంతరం సదరు ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సి నిర్వాహకుల పనితీరుపై విచారణ శూన్యం. దీనితో సదరు సూరారం ప్రధానరహాదారిపై వున్న ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం చేస్తున్న నిర్లక్ష్యంతో పాదచారులు, ప్రయాణీకుల ప్రాణాలు హారీమంటున్నా అధికార యంత్రాంగానికి నిమ్మకు నీరెత్తినట్లుగా వుంటున్న తీరు పలు అనుమనాలకు తావిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## భూదాన్ భూములను పేదలకు పంపిణీ చేయాలి

**-సిపిఐ నేత ఇ.టి.నర్సింహ్మ డిమాండ్**

**సైఫాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చేసిన భూపోరాటాలకు జడిసి నాటి జాగీర్‌దార్లు, జమీందార్లు, పటేళ్లు, పటార్వీలు ప్రభుత్వానికి దానం చేసిన భూదాన్ భూములు పేదలకు పంచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షన్నర ఎకరాలకుపైగా భూదాన్ భూములు రికార్డుల్లో నామోదైయి ఉన్నాయని, నాటి టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాల హాయంలో అప్పటి భూదాన్ బోర్డు చైర్మన్ వందల ఎకరాల భూదాన్ భూములు అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వెంటనే భూదాన్ బోర్డును రద్దు చేసిందని ఆయన గుర్తు చేశారు. అయిత్ భూదాన్ బోర్డు రద్దు చేసి సిసిఎల్ఎలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి ఆ భూములను ధరణిలో నిషేదిత జాబితాలో పొందుపరిచిందన్నారు. ఆదే బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే వందల ఎకరాల భూదాన భూములు కబ్జాకు కబ్జాకు గురైనాయని ఆరోపించారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 780 ఎకరాలకు పైగా భూదాన్ భూములు అన్యాక్రాంతం అయినాయని, అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాగారంలో 170 ఎకరాలు భూదాన్ భూములను అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ఇతరులకు బదాయించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. భూదాన్ భూములను అక్రమించుకున్నవారిని, బదలాయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని, భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని, బలహీన వర్గాలకు 3 ఏకరాల భూమిని పంపిణి చేయాలని, పేద, మద్య తరగతి ప్రజలకు ఇళ్ళ స్థలాల కోసం 150 గజాల స్థలాన్ని పంపిణి చేయాలని, ఇళ్ళు నిర్మించుకునేందుకు 5 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో భూదాన్ భూములు పేదలకు పంచేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

## సాంప్రదాయాలలో దీపావళికి విశిష్ట స్థానం

**-బిజెపి నేత పవన్‌కుమార్‌రెడ్డి**



పవన్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త**

చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అయిన దీపావళి పర్వదినాన్ని జరుపుకోబోతున్న ప్రజలందరికీ బిజెపి సీనియర్ నేత బీరవెల్లి పవన్‌కుమార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నరకాసుర వధ తర్వాత ఇంటింటా దీపాలు వెలిగించుకుని సంతోషంగా జరుపుకునే వెలుగుల పండుగ ఇది అని పేర్కొన్నారు.బుధవారం బర్కత్‌పురలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దీపావళి పర్వదినం తెలుగు ప్రజల ఇళ్లలో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పాడి పంటలతో విరాజిల్లుతూ ప్రజలంతా సుఖవంతమైన జీవనం గడపాలని కోరారు.ప్రజలంతా సాంప్రదాయ బద్ధంగా దీపావళి జరుపుకోవాలని కోరారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలలో ఆధ్యాత్మికతకు విశిష్ట స్థానం ఉందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పవన్ కుమార్‌రెడ్డి అన్నారు.

## పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం



పదవి విరమణ పొందిన జీహెచ్ఎంసి డిప్యూటి కమీషనర్ రమేష్, ఏసీపీ మల్లేశ్వర్ రావులను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి రాఘవేంద్ర.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

అధికారిగా పదవిలో ఉన్నంతకాలం ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రజలకు తగిన విధంగా సేవలు అందించిన అధికారులు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా వారిని ప్రత్యేకంగా కాంగ్రెస్ నాయకులు అభినందించారు. జీహెచ్ఎంసి డిప్యూటి కమీషనర్‌గా రమేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపి)గా పదవి విరమణ చేస్తున్న మల్లేశ్వర్‌లను మోతీనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి రాఘవేంద్ర శాలువతో జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. పదవిలో ఉన్నంతకాలం నీతి నిజాయితీగా పనిచేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలివారని పేర్కొన్నారు.

## లక్ష్మీ కుబేర వ్రతంలో పాల్గొన్న కార్పొరేటర్



**బేగంపేట అక్టోబరు 30,ప్రభాతవార్త**

రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కాలనీ రామ్‌మందిర్ లో బుధవారం లక్ష్మీ కుబేర వ్రతం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ పూజలో పాల్గొనేందుకు జంట నగరాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరలి వచ్చి పూజలో పాల్గొన్నారు.ఈ పూజలో రామ్ గోపాల్‌పేట డివిజన్ కార్పొరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ పూజ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.అమ్మ వారు భక్తులను చల్లగా ఆయురారోగ్యాలతో ఉండేలా ఆశీర్వదించాలని,ప్రతి ఇంట సిరి సంపదలతో తుల తూగేలా అమ్మ వారు అనుగ్రహించాలని కోరుకున్నారు.ఈ పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు



తమ కాలనీకి మంచినీటిని సరఫరా చేయించినందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న రాధా రియాలిటీ ప్రజలు

**నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని రాధా రియాలిటీ కాలనీకి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నూతన పైప్‌లైన్లు వేయించి, మంచినీటిని సరఫరా చేయించారు. దీంతో ఆ కాలనీ ప్రజలు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఇంటికి వెళ్లి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు శంకరయ్య, కుమార్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను తెలుసుకొని, వేగంగా పరిష్కరిస్తుండడం వల్లనే వరుసగా నాలుగు సార్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా ప్రకాశ్‌గౌడ్ గెలుపొందారని వివరించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఏ ప్రాంతంకు చెందిన ప్రజలు వచ్చి తమ ఇబ్బందులను తెలిపినా, వెంటనే స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, ఆ ఇబ్బందిని దూరం చేస్తున్న తీరే ఐదోసారి కూడా ప్రకాశ్‌గౌడ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోకరి సురేష్‌గౌడ్, కాలనీ వాసులు గిరిబాబు, సంతోష్ యాదవ్, శేఖర్, ప్రవీణ్ చారి, రాజుగౌడ్, అశోక్ వాసు, నవీన్, సక్సేనా, రాము తదితరులు పాల్గొన్నారు.

## గండిపేటలో పారిశుద్య కార్మికులకు చీరెల పంపిణీ



పారిశుద్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ గోపాల సునీత గోపాల్

**నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేటలో పని చేస్తున్న కార్మికులందరికి దీపావళి పర్వదినంను పురస్కరించుకొని చీరలు, కొత్తబట్టలను కౌన్సిలర్ గోపాల సునీత గణేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న కార్మికుల వల్లనే పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. మనం వేసే చెత్తనంతటిని రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేసి, సకాలంలో నీరు, కరెంటు సరఫరా చేయడం వల్లనే మున్సిపల్‌లోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. మున్సిపల్ కార్మికులను ప్రజలందరూ గౌరవించాలని, చిన్నచూపు చూడవద్దని తెలిపారు. ఎండ,వాన,చలిలను లెక్క చేయకుండా ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకు రోడ్లపైకి వచ్చి విధులు నిర్వహిస్తున్న కార్మికులను గౌరవించాలని కౌన్సిలర్ సునీత గణేష్ పేర్కొన్నారు.

## ఎంజిఐటిలో ఘనంగా ఏక్తాదివస్ వేడుకలు



గండిపేటలోని ఎంజిఐటి కళాశాలలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివాస్‌ను జరుపుకుంటున్న విద్యార్థులు

**నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త :** గండిపేటలోని ఎంజిఐటి కళాశాలలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని "ఏక్తా దివాస్"ను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని సర్దార్ వల్లాభాయ్ పటేల్ దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని వివరించారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమాలలో క్రియాశీలకంగా పని చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా నాటి యువతలో దేశభక్తిని పెంపొందించి, స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చేశారని తెలిపారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని వివరించారు. దేశంలో ఐక్యతను సర్దార్‌జి ఏ విధంగా తీసుకువచ్చారో వివరించి, విద్యార్థులకు ఐకమత్యం గొప్పతనంను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, హెచ్ఒడిలు డాక్టర్ యం.రవిచందర్, డాక్టర్ వి.హరిలీల తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



రాజీవ్ గాంధీ నగర్‌లో బీజేపి సభ్యత్వ నమోదు చేయుస్తున్న మేడ్చల్ మల్కాజిగిరి బిజెపి కార్యదర్శి పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 30, ప్రభాతవార్త :**

బీజేపి పార్టీ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఆదేశాల మేరకు నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన లభించిందని మేడ్చల్ మల్కాజిగిరి బేజేపి కార్యదర్శి పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ సబ్దార్‌నగర్ బస్తీలలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువత ఎంతో ఉత్సాహంగా సభ్యత్వ నమోదు చేయుస్తున్నారని ప్రజలు కూడా కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అహర్నిశలు ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్నారని ఆయన ప్రవేశ పెట్టే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి పేదవాడికి చేరుతుందని అందుకు తమ బీజేపి నాయకులు కార్యకర్తలు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపి అధ్యక్షులు విజయ్, పూజా రామ్, సాయిచంద్, శ్రావణ్, రవి యాదవ్, మనోజ్, సంతోష్, పాల్గొన్నారు.

## నవంబరు 2 నుంచి లక్ష్మీగణపతి దేవాలయంలో కార్తీకమాసోత్సవాలు

**చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త:** నవంబరు రెండవ తేద నుంచి డిసెంబరు ఒకటవ తేదీ వరకు ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలోని పార్వతీ సమేత క్షీరలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయం ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలుంటాయని, ప్రతి రోజు ఉదయం ఏకవార రుద్రాభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషకం, ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహామంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. 2న కార్తీక మాసం ప్రారంభం, 4న క్షీరాభిషేకం, 5న నాగులచవితి సందర్భంగా నాగదేవతలకు అభిషేకాలు, 11న పెరుగుతో అభిషేకం, 13న తులసీ లగ్నం, 15న సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు, 18న ఘృతశర్కరాభిషేకం, 19న మహాలింగార్చన, 21న గుధ తైలాభిషేకం, 25న తేనెతో అభిషేకం, 29న మాసశివరాత్రి సందర్భంగా బస్మార్చన, సాయంత్రం ఉమామహేశ్వరస్వామి కల్యాణం ఉంటుందన్నారు. డిసెంబరు 1న మహాన్యాసం ప్రారంభం సందర్భంగా బిల్వార్చన, అన్నపూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం ఉంటుందన్నారు.

## పండుగలు సంప్రదాయాలకు ప్రతిరూపాలు : డిఇ విష్ణువర్ధన్ రెడ్డి



విద్యుత్ కార్యాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డిఇ విష్ణువర్ధన్ రెడ్డి,ఏడిఇ వినోద్ రెడ్డి తదితరులు

**మలక్‌పేట అక్టోబరు30,ప్రభాతవార్త :** పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపాలని ఆస్మాన్ ఘడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.ఆస్మాన్ ఘడ్ విద్యుత్ శాఖ డిఇ కార్యాలయంలో దీపావళి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ప్రేక పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొని మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఇలు వినోద్ రెడ్డి,పవన్,జెఎవోలు మహేందర్ ,శ్రీకాంత్,ఏఈలు చారి,శ్రీనివాస్ సిబ్బంది, వినోద్, రమణ, శిరీష్,నాగేంద్ర వేణుగోపాల్,లావణ్య, అరుణ,సూరిబాబు, మహేందర్,రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలి




సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

**మలక్‌పేట అక్టోబరు30,ప్రభాతవార్త :** విద్యార్థులు పట్టుదలతో తమ లక్ష్యాలను సాధించుకోవడానికి కృషి చేయాలని ప్రగతి డిగ్రీ కాలేజీ చైర్మన్ రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.దిల్‌షుక్ నగర్ ప్రగతి డిగ్రి కాలేజ్ కో-ఎడ్యుకేషన్ కళాశాలలో ప్రెషర్స్‌డే వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు.విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేస్తున్నామని వివరించారు.విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ డాక్టర్.పి రామ్ రెడినడ,ఎన్.సీతారాంరెడ్డి,ప్రిన్సిపల్ చిన్నారెడ్డి,అధ్యాపకులు జయచం దర్,విజయ శ్రీ,సుకన్య,విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలి

### -మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్

**మలక్‌పేట అక్టోబరు30,ప్రభాతవార్త :** వాహనదారులు ట్రాఫిక్ నియమ,నిబంధనలు పాటించాలని మలక్‌పేట్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు.దిల్‌షుక్ నగర్ ఆర్టిసి డిపోలో మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ... వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.మద్యం సేవించి వాహనాలను నడపవద్దని తమ గమ్య స్థానాలను చేరుకోవాలని పేర్కొన్నారు.ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఏకాగ్రతతో వాహనాలను నడపాలని,ఎదుటి వాహనాలను గమనించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిప్యూటీ రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్ ,పలువురు ఉద్యోగులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సులో డాన్ హై స్కూల్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న హైస్కూల్ చైర్మన్ ఫజల్ రెహమాన్ ఖుర్రం తదితరులు

**మలక్‌పేట అక్టోబరు30,ప్రభాతవార్త :** కృత్రిమ మేధస్సు-సంభావ్యతలు,ఆందోళనలు అనే అంశంపై హైదరాబాద్‌లోని ఎస్సి ఈఆర్టిలో జరిగిన సైన్స్ సదస్సులో హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన డాన్ హై స్కూల్ విద్యార్థి మొహమ్మద్ ఫాజిల్ రెండో స్థానాన్ని దక్కించుకొని ప్రతిభను కనబరిచారు.బుధవారం మలక్‌పేట్‌లోని డాన్ హై స్కూల్‌లో డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ రహమాన్ ఖుర్రం ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విశ్వవ్యాప్తంగా కృత్రిమ మేధస్సుపై పరిశోధనలు జరుగుతున్న తరుణంలో సాంకేతిక పరిజ్ఞానం అనూహ్య రీతిలో పెరగనుందన్నారు.విద్యార్థులు ఎఐలో అత్యంత ప్రతిభను కనబరిచి విద్యాబోధనలో అగ్రస్థానంలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీలో డాన్ హై స్కూల్‌కు చెందిన విద్యార్థి రెండో స్థానం సాధించి ప్రతిభను కనబరిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## లింగోజిగూడను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా : కార్పొరేటర్



జడ్‌సికి సమస్యల గురించి వివరిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నామని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జోనల్ కమీషనర్ హేమంత కేశవ్ పాటిల్‌తో కలిసి డివిజన్‌లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్లోబల్ ఆసుపత్రి వరకు, గ్లోబల్ ఆసుపత్రి నుంచి సిఎం రోడ్డు వరకు కనెక్టింగ్ నూతన రోడ్డు నిర్మాణానికి, గ్రీన్‌పార్క్ కాలనీ మెయిన్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జడ్‌సిని కోరారు. సరూర్‌నగర్ చెరువు ఇన్‌లెట్, ఔట్‌లెట్‌ల వద్ద పూడిక తొలగించాలని, ఎస్ఎన్‌డిపి పనుల ప్యాచ్ వర్క్ పూర్తి చేయాలని, మెగా ఫంక్షన్ హాల్ వద్ద నాలాపై ఉన్న బ్రిడ్జిని వెడల్పు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జడ్‌సి మాట్లాడుతూ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసి సేవా ఇస్లావత్, ఏఎంహెచ్‌ఓ నగేష్ నాయక్, డిఇ కార్తీక్, ఏఇ విజయ్ కుమార్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, గౌస్, నరేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో అనుమతి లేకుండా బాణాసంచా దుకాణాలు..!

### -ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్ .. అక్రమంగా వసూళ్లు



ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ రహదారిలో అనుమతి లేకుండా వెలిసిన బాణాసంచా దుకాణాలు దృశ్యం.



రామంతాపూర్ ప్రధాన రహదారిలో అనుమతి లేకుండా వెలిసిని బాణాసంచా దుకాణాలు దృశ్యం.

**ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనుమతి లేకుండా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అనుమతి లేకుండా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయవద్దని సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి పోన్నం ప్రభాకర్, గ్రేటర్ కమిషనర్ ఇలంబరితి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేసినా అధికారులు ఖాతరు చేయడం లేదు. బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలంటే జిహెచ్‌ఎంసి నుంచి ట్రేడ్ లైసెన్స్‌తోపాటు, పోలీస్, ఫైర్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. జనావాసాలకు దూరంగా వీటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు అనుమతి ఇస్తారు. అయితే ఉప్పల్ సర్కిల్‌లో వీటిని అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఉప్పల్ పరిధిలోని ఉప్పల్ ప్రధాన రహదారితోపాటు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ రహదారిలో అనుమతి లేకుండా పదుల సంఖ్యలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. మండే మార్కెట్ నుంచి చిలుకానగర్ రహదారి వరకు జనావాసాల మధ్య బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అదే విధంగా రామంతాపూర్ నెహ్రునగర్, గణేష్‌నగర్, ప్రధాన రహదారిలో కూడా పదుల సంఖ్యలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. చిలుకానగర్ ప్రధాన రహదారితోపాటు, హబ్సిగూడ రహదారి, స్ట్రీట్‌నెం.8లో కూడా అనుమతి లేకుండా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

**ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్ :**

బాణాసంచా దుకాణాలు ప్రజలకు ఇబ్బంది లేకుండా జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని, దుకాణాల వద్ద ఫైర్ సేఫ్టీ కిట్స్ ఉపయోగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే చాలా చోట్ల దుకాణదారుల వీటిని పట్టించుకోవడం లేదు. బాణాసంచా దుకాణాల వద్ద జిహెచ్‌ఎంసి, పోలీస్, ఫైర్ అధికారులు మాముళ్ల వసూలు చేస్తున్నారని, అనుమతి కోసం వెళితే కూడా తమను వేధిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీంతో తాము ఎటువంటి అనుమతి లేకుండా వీటిని ఏర్పాటు చేస్తున్నామని పలువురు దుకాణదారులు పేర్కొంటున్నారు. జిహెచ్ఎంసి, పోలీస్, ఫైర్ అధికారులు బాణాసంచా ఉచితంగా తీసుకుని వెళుతారని, ప్రశ్నిస్తే తమపై కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని మరికొందరు పేర్కొంటున్నారు. నగరంలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నా దీనిని పట్టించుకోవడం లేదు. కాగా బుధవారం కొన్ని ప్రాంతాల్లో ఫైర్ సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్లినట్లు విమర్శలు ఉన్నాయి. అధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతికి బిఆర్ఎస్ కార్పొరేటర్ల సన్మానం



కమీషనర్‌ను సన్మానిస్తున్న బిఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.సరస్వతిని కార్పొరేషన్‌కు చెందిన బిఆర్ఎస్ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్పొరేషన్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్గంటి అర్జున్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ యాతం పవన్ యాదవ్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె ఖలీల్ పాషా, కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, ఇఎల్‌వి అశోక్ తదితరులు కార్పొరేషన్ కార్యాలయానికి తరలివచ్చి నూతన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టినందుకు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో అభివృద్ధికి సహకరించాలని ముక్తకంఠంతో కోరగా ఆమె సానుకూలంగా స్పందించి తప్పకుండా అన్ని డివిజన్లలో అభివృద్ధి జరిగేటట్లు చూస్తామని హామీనిచ్చారు.

**కమీషనర్‌కు డిప్యూటీ మేయర్ పుస్తకం బహూకరణ**

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.సరస్వతి బుధవారం డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆమె డిప్యూటీ మేయర్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్చానిచా ్చరు. అనంతరం శేఖర్ ఆమెను కార్పొరేషన్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టినందుకు అభినందిస్తూ పుస్త కాన్ని బహూకరించారు.

## కురుమల అభ్యున్నతికి తన వంతు కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న ఉప్పల్ కురుమ సంఘం నేతలు

**ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** కురుమలు ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ కురుమ సంఘం నూతన కమిటి నేతలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి గొంగడితో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కురుమలంతా ఐక్యంగా ఉండాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. కురుమలకు ఆలయ కమిటి పదవులు ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బీరప్ప ఆలయం ప్రాంగణంలో కలాయణ మండపం నిర్మించేందుకు సహకారం అందిస్తానని తెలిపారు. వెలుగుగుట్ట చైర్మన్ జన్ని రఘు, సోము బాలమణి, ఇతర కమిటి నేతలను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు గొరిగె మల్లేష్, రేవు కృష్ణయ్య, గొరిగె పెద్ద మల్లేష్, కొల్లు ఐలయ్య, కురుమ సంఘం అధ్యక్షులు చిందం వెంకటేష్, బర్ల కృష్ణ, కొంద్ర హనుమంతు, ఎర్ర శ్రీనివాస్, కర్రె శ్రీనివాస్, శాగ పెంటయ్య, యువత కమిటి అధ్యక్షుడు ముత్యంగారి రాకేష్, కరికె మహేష్, మహిళా కమిటి అధ్యక్షురాలు బట్కిరి మంజుల, ముత్యంగారి లత,కె.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## మధు యాష్కీని విమర్శించే హక్కు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**వనస్థలిపురం అక్టోబరు30,ప్రభాతవార్త :** అవినీతితో కోట్ల రూపాయలు సంపాదించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి విలువలతో కూడిన మధు యాష్కీ గౌడ్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.118 జీవో విషయంలో ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మధు యాష్కీ గౌడ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వనస్థలిపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జీవెచ్‌ఎంసి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి,పిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్ ,సామ రమణా రెడ్డి,డివిజన్ల అధ్యక్షుడు ముకుంటం సదా శివుడు,కుట్ల నర్సింహ యాదవ్,తదితరులు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రెండుసార్లు ఎంపిగా పనిచేసిన మధు యాష్కీ గౌడ్ ఆస్తులు ఎంత,కార్పొరేటర్ స్థాయి నుండి మూడు సార్లు ఎమ్మెల్యే పనిచేసిన నీ ఆస్తులు ఎంత బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు.పేకాట క్లబ్‌లు నడిపిస్తూ ఎలాపైకి వచ్చావో అందరికీ తెలుసునని విమర్శించారు.ఎల్.బినగర్‌లో చెరువులు కుంటలు కబ్జా చేసి కోట్లు కాజేసిన చరిత్ర నీది అని ఆరోపించారు.118 జీవో తప్పుల తడక అని కేవలం ఎన్నికల్లో గెలవడానికి జీవో తెచ్చి 11 ఏళ్ల ఎమ్మెల్యే ఉండి ప్రజలను మోసం చేశావని విమర్శించారు.అంతేకాకుండా ఎమ్మెల్యేగా మున్సిపాలిటీలో ఉద్యోగాలు పెట్టించే దగ్గర నుండి అధికారులకు పోస్టింగ్‌లు ఇప్పించే వరకు డబ్బులు సంపాదించిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు.6 నెలలో సమస్య పరిష్కరించకపోతే రాజీనామా చేస్తానని ప్రజలను మోసగించిన చరిత్ర నీది కాదా అని విమర్శించారు.విలువలతో కూడిన రాజకీయం చేసే మధు యాష్కీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,వేణుగోపాల్ యాదవ్,కిశోర గౌడ్, సత్యనారాయణ,చెన్నగొని రవి,దేరింగుల కృష్ణ,పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో బిజెవైఎం నిరసన ప్రభావం

### స్పెషల్ డ్రైవ్‌తో చెత్త కుప్పలను తొలగించిన అధికారులు



నిరసన జరిగిన ప్రదేశంలో చెత్తను తొలగించిన దృశ్యం

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో పేరుకుపోయిన చెత్త కుప్పలపై సమర భేరి మ్రోగిస్తూ ఇటీవల కార్పొరేషన్ బిజెవైఎం నాయకులు చేసిన వినూత్న నిరసన కార్యక్రమానికి కార్పొరేషన్ స్పందించింది. కొన్ని రోజుల క్రితం కార్పొరేషన్ భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మేయర్ స్వంత డివిజన్‌తో పాటు పలు డివిజన్లలో రహదారుల పక్కన చెత్త కుప్పల వద్ద లవ్ బడంగ్‌పేట్ పేరుతో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. దీంతో స్పందించిన కార్పొరేషన్ పారిశుధ్య విభాగం సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి చెత్త కుప్పలు ఉన్న ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులచే యుద్ధ ప్రాతిపదికన చెత్తను ఆయా ప్రాంతాల నుండి తరలించి శుభ్రం చేయించారు.

**స్వచ్ఛతకు సహకరించాలి : సానిటరీ ఇన్స్‌పెక్టర్ యాదగిరి**

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో స్వచ్ఛతకు అందరూ సహకరించాలని సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయ యాదగిరి కోరారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి చెత్తను తొలగించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లలో ఎక్కడా కూడా బహిరంగంగా ఎవ్వరూ చెత్తను పారేయవద్దని కోరారు. ఇంటికి వచ్చే చెత్త రిక్షాల వారికి చెత్తను ఇవ్వాలని ఆయన సూచించారు. కార్పొరేషన్‌లో ఎక్కడైనా చెత్త కుప్పలు కనిపిస్తే తమకు సమాచారం ఇస్తే తప్పకుండా తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## మోడల్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని జడ్‌సికి వినతి




జడ్‌సికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ రెడ్డి బస్తీ, భూలక్ష్మినగర్‌లలో మోడల్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి బుధవారం జోనల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరంన కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా జిమ్‌లు ఏర్పాటు చేయడం వల్ల బస్తీ వాసులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** కాలనీల్లో రోడ్లను శుభ్రపరచడంతో పాటు చెత్తచెదారాలు పోగవకుండా, నీరు నిలవకుండా చూడాలని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపరుచాలని, రోడ్లపై చెత్తచెదారాలను రోజువారిగా శుభ్రం చేయించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. పారిశుద్ధ్య సమస్యతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీనిచ్చారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కార్మికులను హెచ్చరించారు.

## బైక్‌ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలి : హరిసింగ్‌నాయక్

**హయత్‌నగర్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించే బైక్‌ర్యాలీలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-1 నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ ఆర్ఎన్ఆర్ ఎక్స్‌రోడ్స్, రాజీవ్ గృహకల్ప, కళానగర్ చౌరస్తామీదుగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ఆటోయూనియన్, మెట్టుమైసమ్మ వరకు కొనసాగి అనంతరం జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో బహిరంగ సభ నిర్వహించబడుతుందని తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-2లో సభ ఉంటుందని కార్మికులు పెద్దఎత్తున హాజరై ర్యాలీని, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

## డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జోత్స్నప్రభకు వీడ్కోలు



జోత్స్నప్రభను మెమొంటోతో సత్కరిస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర బృందం

**హయత్‌నగర్, అక్టోబరు 30 ప్రభాతవార్త:**

హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జోత్స్నప్రభ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు, అభినందన సభలో అధ్యాపకలు, అధ్యాపకేతరులు, విద్యార్థులు, అతిథులు జోత్స్నప్రభ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... బోధనా వృత్తి ఎందో పవిత్రమైనదని దానిమీద ఆసక్తితో ఇంజనీరింగ్ చవివిన ఆమె తెలుగు సాహిత్యంమీద అభిమానంతో ఎంఏ తెలుగు పూర్తిచేసి డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. ఎంత కాలం పనిచేశామన్నది ముఖ్యం కాదని తమ బోధనలతో ఎంతమంది జీవితాల్లో వెలుగులు నింపామన్నది ముఖ్యమన్నారు. జోత్స్నప్రభ మంచి కవి, రచయిత అని ఆమెను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. జోత్స్నప్రభ మాట్లాడుతూ... ప్రిన్సిపల్‌గా పనిచేసిన నాలుగేళ్ల కాలం తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందని, తనకు సహకారం అందించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఐఎస్ సదన్ డివిజన్‌లో ఫుట్‌పాత్‌ల నిర్మాణం



ఫుట్‌పాత్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ భూలక్ష్మి దేవాలయం, గోశాల వద్ద నూతనంగా ఫుట్ పాత్ నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్ పనులను రూ.4.20 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మోహన్‌రెడ్డి, అరవింద్, సందీప్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### కుల గణన పట్ల హర్షం వ్యక్తం చేసిన మిద్దెల జితేందర్

**సైదాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కుల గణనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన సర్వే చేపట్టడం హర్షించదగిన విషయమన్నారు. సర్వేకు సేవాదళ్ కార్యకర్తలు అండగా నిలుస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను సేవాదళ్ కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు.

## ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలి

### - మేయర్ పారిజాత



శిక్షణా కార యక్రమంలో దిశానిర్దేశనం చేస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వేను బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విజయవంతం చేయాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కార్పొరేషన్‌లోని ప్రజాభవన్‌లో అదే విధంగా కార్పొరేషన్ కార్యాలయంలో సర్వేకు సంబంధించిన అంశాలను సేకరించే మహిళా గ్రూపుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా సమావేశాలకు హాజరైన ఆమె శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనలతో చేపట్టే కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ పి.సరస్వతి, డిఇఇ నర్సింహరాజు, టిపిఎస్ లాలప్ప, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఇంఛార్జి మేనేజర్ నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కమిషనర్‌కు బిజెపి కార్పొరేటర్లు, నాయకుల సన్మానం



మీర్‌పేట్ కమిషనర్‌ను సన్మానిస్తున్న బిజెపి కార్పొరేటర్లు

**సరూర్‌నగర్,అక్టోబర్ 30 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వర్‌ను బిజెపి కార్పొరేటర్లు, నాయకులు సన్మానించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్ ముత్తంగి కరుణానిధి, నాయకులు చెవ్వ శ్రవణ్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి గాజుల మధు కమీషనర్‌ను కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## పదవి విరమణ పొందిన పోలీసులకు సత్కారం



పదవి విరమణ పొందిన అధికారులతో రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు..

**నేరెడ్‌మెట్,అక్టోబర్30 ప్రభాతవార్త:** పోలీసు ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, 24గంటలు ప్రజలకు సేవ చేస్తుండాలని రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు అన్నారు. బుధవారం రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవి విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పదవి విరమణ పొందిన వారిని సత్కరించారు. రాచకొండ పోలీస్ కమీషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నవీన్, సబ్ ఇన్స్‌పెక్టర్ రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం సబ్ ఇన్స్‌పెక్టర్ క్రిష్ణారెడ్డిలను కమీషనర్ సుధీర్ బాబు సన్మానించి సత్కరించారు. పోలీసు శాఖలో సమర్థవంతంగా పనిచేసి వారి సేవలను అందించినందుకు వారిని అభినందించారు. పదవి విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని సంతోషంగా గడపాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలన్నారు. పోలీసు శాఖ నుండి వారికి రావాల్సిన ప్రయోజనాలను త్వరగా వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డీసిపి అడ్మిన్ ఇందిర, డీసిపి క్రైమ్ అరవింద్ బాబు,ఎస్బి ఏసిపి శ్రీధర్ రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### రామంతాపూర్‌లో సదర్ సమ్మేళనానికి ఎంపి ఈటలకు ఆహ్వానం



మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌కు సదర్ సమ్మేళనం ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వల్లపు జగన్‌యాదవ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో బిజెపి సీనియర్ నేత వల్లపు జగన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదర్ సమ్మేళనానికి హాజరుకావాలని బుధవారం పలువురు బిజెపి నేతలు ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ సదర్ సమ్మేళనం ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించడ అభినందనీయమని, ఉత్సవాలకు తప్పక హాజరవుతానని తెలిపారు. వల్లపు మల్లేష్ యాదవ్, జగన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు పలువురు పార్టీ నేతలు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

### ఆదర్శనగర్‌లో పార్కు కబ్జా అరికట్టాలని కమిషనర్‌కు వినతి

**ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ ఆదర్శనగర్ కాలనీలో పార్కు స్థలం కబ్జా అరికట్టాలని పలువురు స్థానికులు బుధవారం ఉప్పల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, కమిషనర్ అంజనేయులు కలిసి ఫిర్యాదులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి, శాధా రాజిరెడ్డి,ప్రధాన కార్యదర్శి మెట్టు ప్రభాకర్‌రెడ్డి, రొండ్ల పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు కొంపల్లి రవీందర్, పల్లె నర్సింగ్‌రావు తదితరులు మాట్లాడుతూ ఆదర్శ నగర్ కాలనీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారని, సర్వే నెంబర్ 56లో పార్కు కోసం సుమారు 440 గజాల స్థలం వదిలిపెట్టారని తెలిపారు. అయితే సమీపంలో ఉండే స్థల యజమానులు పార్కు స్థలం ప్రహరిగోడ ధ్వంసం చేసి నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అనుమతికి విరుద్ధంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ అనుమతి రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.

## పూజా సామాగ్రి దుకాణం వేలం ప్రక్రియ

**సైదాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో గతంలో వాయిదా పడిన కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునే హక్కు వేలం ప్రక్రియను బుధవారం తిరిగి నిర్వహించారు. దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమీషర్ టి.శేఖర్ పర్యవేక్షణలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రక్రియను నిర్వహించారు. వేలం పాటలో రూ.1,01,50,000లకు రవి ఈ హక్కును దక్కించుకున్నారు.